సాక్షి వికారాబాద్

ఆదివారం । 8 । జూన్ । 2025



రోడ్లపైనే నిరీక్షణ!

దుద్యాల్ మండలంలోని పలు గ్రామాల్లో బస్టాండ్‌లు లేక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10లో▸



నిందితులపై చర్యలు..

దళితులపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ కోరారు. 10లో▸



బడి బయట ఉండొద్దు

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు, ఎంఈఓలు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



గణపతి హోమం నిర్వహిస్తున్న దంపతులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవాలయ 11వ వార్షికోత్సవ వేడుకలు పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటలకు స్వామివారికి అభిషేకం, అలంకరణ. మహా మంగళ హారతి, 9గంటలకు గణపతి హోమం, మహా నైవేద్యం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ గావించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కండేయ కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులను మెమొంటోలతో ఘనంగా సన్మానించారు.

పెద్దేముల్ ఎస్‌ఐగా ప్రశాంత్‌వర్ధన్



తాండూరు రూరల్: పెద్దేముల్ ఎస్‌ఐగా ప్రశాంత్ వర్ధన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన శ్రీధర్‌రెడ్డి సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న ప్రశాంత్ వర్ధన్‌ను పెద్దేముల్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని శివారెడ్డిపల్లిలో మూడు నెలల రేషన్ కోటా బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని లబ్ధిదారులకు యూడు నెలల బియ్యాన్ని ఒకే సారి పంపిణీ చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నట్లు చెప్పారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



సుమన్ (ఫైల్)

తాండూరు టౌన్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం తాండూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన వాగ్మాడే సుమన్ (24) కొన్నేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు శవాన్ని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుని తండ్రి ముకుందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

కోట్‌పల్లి ఎస్‌ఐగా శైలజ



బంట్వారం: కోట్‌పల్లి ఎస్‌ఐగా శైలజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన అబ్దుల్ గఫార్ డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో డీసీఆర్‌బీలో పనిచేసే శైలజను ఇక్కడికి పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.



తాండూరు టౌన్: పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయాన్నే ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మసీదుల్లో నమాజ్‌లు పూర్తి చేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. మత పెద్దలు, మౌలాలు దైవ సందేశాన్ని వినిపించారు.ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. అనంతరం ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



చిన్నారుల ఆలింగనం

ఫిట్‌లెస్..!

బడి బస్సుల భద్రతపై అనుమానాలెన్నో

- జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు 195
- రిజిస్ట్రేషన్ అయిన స్కూల్ బస్సులు 250
- అనధికారికంగా తిప్పుతున్నవి వందకు పైనే..
- ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయినవి 40 మాత్రమే
- మరో నాలుగు రోజుల్లో తెరుచుకోనున్న పాఠశాలలు



వికారాబాద్: బడి బస్సు భద్రమేనా..? అంటేకాదనే సమాధానం వస్తోంది. తరచూ స్కూల్ బస్సులు మొరాయిస్తూనే ఉన్నాయి. బ్రేకులు ఫెయిల్ కావటం.. రోడ్డు పక్కకు దూసుకెళ్లడం.. ప్రమాదాలకు గురికావడం సర్వసాధారణంగా మారింది. గతే డాది కూడా స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురైన ఘటనలు మనం చూశాం. ఈ నెల 12నుంచి పాఠ శాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో బడి బస్సులు కండీషన్‌పై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. జిల్లాలో 195 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 250 వరకు రిజిస్ట్రేషన్ అయిన బస్సులు ఉన్నాయి. మరో వంద బస్సులను అనుమతులు లేకుండా తిప్పుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు 40 బస్సులు మాత్రమే యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోగా మిగతా వారు దరఖాస్తు కూడా చేసుకోలేదు. నిబంధనలు తుంగలో తొక్కి బస్సులు తిప్పుతునఆన ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలకు నీళ్లు

చాలా వరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాత బస్సులు కొనుగోలు చేసి వాటికి పేయింట్ రుద్ది కొత్త బస్సుల్లా కలరింగ్ ఇస్తున్నారు. ఆర్టీఏ అధికారులు ఫిట్‌నెస్ చెక్ చేసే సమయంలో బస్సు టైర్లు, పేయింటింగ్, రేడియం స్టిక్కర్లు, లైట్లు, సీట్లు, అనుభవం, నైపుణ్యంగల డ్రైవర్లు ఇలా అన్నీ పరిశీలించాలి. కానీ నామమాత్రంగా చెక్ చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఏటా బస్సులు ప్రమాదాలకు గురై చిన్నారులు ఆస్పత్రుల పాలవుతున్నారు. జిల్లాలో 15 సంవత్సరాలు దాటి ఫిట్‌నెస్ లేని బస్సులు వందకు పైగా ఉన్నట్లు సమాచారం. వీటికి ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకోకుండా ఆర్టీఏ అధికారులను మ్యానేజ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్కూల్ బస్సు నడపాలంటే హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. ఐదు సంవత్సరాల అనుభవం తప్పనిసరి. కానీ ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఇవేవీ పాటించటంలేదు. జిల్లాలో మొత్తం 45 వేల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతుండగా 50 శాతం మంది స్కూల్ బస్సుల్లోనే పాఠశాలలకు వెళ్తున్నారు. మరో నాలుగు రోజుల్లో 200 స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయడం సాధ్యమేనా అనేది ప్రశ్న తలెత్తుతోంది.

నోటీసులు ఇచ్చాం



పాఠశాలల పునఃప్రారంభం లోపే స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. నిబంధనలకు లోబడి బస్సుల్లో అన్ని పరికరాలు ఉండేలా చూసుకోవాలి. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోని వారికి నోటీసులు ఇచ్చాం. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డెక్కే బస్సులను సీజ్ చేస్తాం.

– వెంకట్‌రెడ్డి, డీటీఓ, వికారాబాద్

పాటించాల్సిన నిబంధనలు

- హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు ఐదు సంవత్సరాల అనుభవం ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలి. కంటి చూపు, షుగర్, బీపీ, ఫిట్స్, గుండెజబ్బులు లేనివారిని మాత్రమే డ్రైవర్లుగా నియమించుకోవాలి. వారికి ప్రతి మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించాలి.
- ఆర్టీఏ నిబంధనల ప్రకారం 15 సంవత్సరాలు దాటిన బస్సులను విద్యార్థుల రవాణాకు వినియోగించరాదు.
- 60 సంవత్సరాలు నిండిన వారిని డ్రైవర్లుగా కొనసాగించరాదు.
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ సేఫ్టీ పరికరాలు కచ్చితంగా ఉంచాలి. అందులో మందులు ఉండేలా చూసుకోవాలి. కాలం చెల్లిన మందులు, పరికరాలు ఎప్పటికప్పుడు మార్చాలి.
- విద్యా సంస్థల పేరు, ఫోన్ నంబర్ బస్సుకు ఎడమవైపు వెనకభాగంలో కనిపించేలా రాయించాలి. బస్సులో అటెండర్‌ను కచ్చితంగా ఉండాలి.
- చిన్నారులు బస్సు ఎక్కడం, దిగటం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కుంభాకార అద్దాలు ఏర్పాటు చేసుకోవాలి.
- విద్యార్థుల బ్యాగులు ఉంచుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి.
- ప్రతి పది బస్సులకు అదనంగా మరో బస్సును అందుబాటులో ఉంచుకోవాలి. రక్షణ చర్యల్లో భాగంగా కిటికీల మధ్యలో రాడ్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- ఫుట్ బోర్డులో మొదటి మెట్టు భూమికి 325 మిల్లీ మీటర్ల ఎత్తు మించ రాదు. మిగతా అన్ని మెట్లు కూడా జారకుండా లోహంతో నిర్మితమై ఉండేలా చూసుకోవాలి.
- తల్లిదండ్రులు కూడా బస్సులు బాగున్నాయా లేదని అని పరిశీలించాలి.

మరో లగచర్ల చేయొద్దు



ఎనికేపల్లి భూములను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

- భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకోం
- అన్నదాతలకు అన్యాయం జరగనివ్వం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మొయినాబాద్: ఎనికేపల్లి భూముల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే మరో లగచర్లను చూస్తారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లిలో ప్రభుత్వం గోశాలకు కేటాయించిన భూములను శనివారం ఆమె సందర్శించారు. రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి మద్దతుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 నెలలుగా రాష్ట్రంలో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కొన్ని రోజులు మూసీ పరిసరాల్లో పేదలను గుంజేశారని.. ఫుట్‌పాత్‌పై ఉండే పేదలను లాగేస్తున్నారన్నారు. లగచర్లలో గిరిజనుల భూములు గుంజుకునే ప్రయత్నం చేశారని.. ఇబ్రహీంపట్నం, కందుకూరు, మహేశ్వరం మండలాల్లో కొత్త రోడ్డుకోసం 3వేల ఎకరాలు పేదల భూములు తీసుకుంటున్నారని విమర్శించారు. సంగారెడ్డి, గద్వాలలో పేదల భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తాజాగా ఎనికేపల్లిలో గోశాల ఏర్పాటుకోసం అంటూ వంద ఎకరాలను రైతుల నుంచి లాక్కుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏదో రకంగా పేదలు, చిన్న, సన్నకారు రైతుల భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. ఎనికేపల్లి విషయం తెలిసి కేసీఆర్ తనను ఇక్కడి పంపారన్నారు. రైతుల భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకోబోమని.. వారికి మద్దతుగా పోరాడతామని స్పష్టం చేశారు.

1954 నుంచి రైతులే సాగు చేస్తున్నారు

ఎనికేపల్లిలో 1954లోనే హరిజనులు సాగుచేసుకుంటున్నట్లు రికార్డులో ఉందని.. 1998 వరకు రైతులు శిస్తు కట్టిన రసీదులు ఉన్నాయన్నారు. ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వం భూములను ఎలా తీసుకుంటుందని నిలదీశారు. వాళ్ల భూములు వారికే పట్టా చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలపై చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

కోకాపేట భూములను అమ్ముకోవడానికే..

కోకాపేటలో గోశాలకు 200 ఎకరాల భూమి ఉందని.. అందులో 100 ఎకరాలు ప్రభుత్వం తీసుకుని దానికి బదులు ఎనికేపల్లిలో ఇవ్వడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. గోశాలకు ఇవ్వాలంటే మొయినాబాద్ మండలంలోనే ప్రభుత్వం పీఓటీ చట్టం కింద స్వాధీనం చేసుకున్న వెయ్యి ఎకరాల భూమి ఉందని గుర్తు చేశారు. ప్రతి ఫాంహౌస్, ప్రతి కాలేజీలో ప్రభుత్వ భూమి ఉందని.. వాటిని బయటకు తీయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొత్త నర్సింహారెడ్డి, దేశమొల్ల ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, శ్రీహరియాదవ్, సుధాకర్‌యాదవ్, రాఘవరెడ్డి, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు కొత్త మాణిక్‌రెడ్డి, మోర శ్రీనివాస్, రవీందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగల కోసమే మహిళ హత్య

పక్కింటి మహిళ దురాగతం

- మృతురాలు రంగారెడ్డి జిల్లాకు చెందిన బాలమ్మగా గుర్తింపు
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి

పూడూరు: రెండు రోజుల క్రితం మండలంలోని కండ్లపల్లి గేటు సమీపంలో లభించిన మృతురాలి వివరాలు తెలిసినట్లు చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కండ్లపల్లి గేటు సమీపంలో రెండు రోజుల క్రితం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కేసు విచారణలో భాగంగా మహిళ మృతదేహం ఫొటోలను పోలీసులు అన్ని స్టేషన్లకు పంపారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం ఖానాపూర్‌కు చెందిన రామేశ్వరం బాలమ్మ కనిపించడం లేదని కుటుంబీకులు రెండు రోజుల క్రితం నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని అక్కడి పోలీసులు చన్గోముల్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టగా మృతురాలు రామేశ్వరం బాలమ్మ(70)గా తేలింది. బాలమ్మ ఇంటి పక్కన ఉండే అనిత వికారాబాద్‌లో కల్లు మంచిగా ఉంటుందని చెప్పి ఆమెను కండ్లపల్లి గ్రామానికి పిలుచుకొచ్చింది. నీలగిరి చెట్లల్లోకి తీసుకెళ్లి కల్లు తాపించి గొంతునులిమి చంపింది. అనంతరం మృతురాలి మెడలోని రెండు తులాల బంగారు గొలుసు, కాళ్లకు ఉన్న వెండి పట్టీలను తీసుకొని పారిపోయింది. నార్సింగ్ సీఐ హరికృష్ణ అనితను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

శంకర్‌పల్లి: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో రెండు నుంచి వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం హనుమాన్ దేవాలయం నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకు ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తీర్థప్రసాదాలు స్వీకంచారు. ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు మోహన్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, పాండురంగారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

పంటకు గంగరాయి

నీళ్లపల్లిలో 500 ఎకరాల్లో విస్తరించిన రాళ్లభూమి

- ప్రతికూల వాతావరణంలోనూ దిగుబడి
- పత్తి, జొన్న, శనగ పంటలకు ఎంతో మేలు
- యంత్రాలతోనే సాగు చేయాలంటున్న రైతులు



పొలంలో ఉన్న రాళ్లు

బషీరాబాద్: సాధారణంగా పొలాల్లో రాళ్లు ఉంటే పంటలు సరిగ్గా పండవు.. వాటిని తొలగించేందుకు రైతులు ఎంతైనా ఖర్చు చేస్తుంటారు.. కానీ బషీరాబాద్ మండలం నీళ్లపల్లిలో ఆ రాళ్లే పసిడి పంటకు దోహదం చేస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు వందల ఎకరాల్లో పలుగురాళ్లు (గంగారాయి) రాశులు పోసినట్లు కనిపిస్తాయి. అవి పొలంలో తడి ఆరకుండా పంట ఎదుగుదలకు దోహసం చేస్తున్నాయి. రబీ సీజన్‌లో జొన్న, శనగ, తెల్ల కుసుమ పంటలకు ఈ రాళ్లు జీవం పోస్తున్నాయి. విత్తు మొదలు పంట కోసే వరకు భూమిలో తేమశాతం తగ్గకుండా కాపాడుతున్నాయి.

ఏడాదికి రెండు పంటలు

బషీరాబాద్ మండలంలోని నీళ్లపల్లి, జలాల్‌పూర్ తోపాటు కొండగల్ నియోజకవర్గంలోని రుద్రారం, టేకుల్‌కోడ్ గ్రామాల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో ఈ రాళ్ల పొలాలు ఉన్నాయి. ఈ రాళ్లను రైతులు గంగ రాయి, చలువరాయి అని పిలుస్తారు. ఈ భూముల్లో ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నారు. ఖరీఫ్‌లో పత్తి, కంది ఎక్కువగా సాగు చేస్తారు. పత్తి మంచి దిగుబడి వస్తుందని.. కంది సాగుకు అంతగా అనుకూలించవని రైతులు చెబుతున్నారు.

యంత్రాలతోనే సాగు

పొలమంతా గంగరాళ్లు ఉండటంతో ఎద్దులతో వ్యవసాయం చేయడం చాలా కష్టం. కూలీలు కూడా పనిచేయలేని పరిస్థితి. రాళ్ల కారణంగా పొలాల్లో నడవలేరు. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా యంత్రాలను వినియోగిస్తున్నారు. విత్తు మొదలు పంట కోతలు, నూర్పిడి వరకు యంత్రాలనే వాడుతున్నారు. కేవలం పత్తి తీసేందుకు మాత్రం కూలీలను వినియోగిస్తున్నారు.

అధిక దిగుబడికి దోహదం

గంగరాయి పొలాలు పత్తి, జొన్న, శనగ పంటలకు అనుకూలం. సాధారణ పొలాల కంటే వీటిలో అధిక దిగుబడి వస్తుంది. ముఖ్యంగా రబీ సీజన్‌లో తేమ శాతం తగ్గదు. దీంతో పంటలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

రాళ్లే పంటకు జీవం

మా కుటుంబానికి 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పొలం నిండా రాళ్ల రాశులు పోసినట్లు ఉంటాయి. ఆ రాళ్లే సిరులు కురుపిస్తున్నాయి. భూమిలో తడి ఆరకుండా మేలు చేస్తాయి. పత్తి, కంది, జొన్న, శనగ సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది. ఎకరాకు 13 క్వింటాళ్ల పత్తి వస్తుంది. జొన్నలు అయితే 14 క్వింటాళ్లు వస్తాయి.

– రుక్మారెడ్డి, రైతు నీళ్లపల్లి

నేల వేడెక్కదు

సూర్య కిరణాలు పలుగు రాళ్లపై పడటం ద్వారా పొలం వేడెక్కదు. ఈ రాళ్లు 60శాతం మేర ఎండను అడ్డుకుంటాయి. తద్వారా భూమిలో తేమ ఆరదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా పంటలకు ఎలాంటి నష్టం జరగదు. పొలం లోపల పైన రాళ్లు ఉండటంతో పంటకు చలువ లభించి మొక్కలు ఏపుగా పెరుగుతాయి. దీంతో అధిక దిగుబడి వస్తుంది.

– సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, తాండూరు

క్లుప్తంగా

కేజీబీవీలో ఎంఎల్‌టీ కోర్సు

యాచారం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఈ ఏడాది నుంచి ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) ఇంటర్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు విద్యాలయ ప్రత్యేకాధికారి అరుణశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సులో 40 సీట్ల చొప్పున భర్తీ చేస్తామని తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 83318 33426 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు. ఎంఎల్‌టీ బోధించడానికి ఆసక్తి కలిగిన అధ్యాపకులు కూడా సంప్రదించాలన్నారు.

నెల రోజులకు కుటుంబం చెంతకు



కుర్మిద్ద గ్రామానికి చెందిన మల్కాపురం నర్సింహ

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో నెల రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి శనివారం కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్కాపురం నర్సింహ మే 7న ఇంటి నుంచి పని కోసమని వెళ్లి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికిన జాడలేకపోవడంతో గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నల్లగొండ, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ జిల్లాల్లోని పలు చోట్ల వెతికి శనివారం నగరంలోని ఎల్బీనగర్ ప్రాంతంలో నర్సింహ సంచరిస్తుండగా గుర్తించి తీసుకొచ్చారు. కుర్మిద్దలోని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అదుపు తప్పి రేకుల షెడ్డును ఢీకొట్టి

- రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు


రుతికేష్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: అదుపు తప్పిన బైక్ రేకుల షెడ్‌ను ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ జగదీశ్ కథనం ప్రకారం .. మంచిర్యాలకు చెందిన రుతికేష్(20) ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ కళాశాలలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ పార్టీ అనంతరం స్నేహితుడు సంజయ్ ఉంటున్న మంగల్‌పల్లి హాస్టల్‌కు మరో స్నేహితుడు శంకర్‌తో కలిసి బైక్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి దాటిన తర్వాత శేరిగూడ గాంధీ విగ్రహం వద్దకు రాగానే వేగంగా వస్తున్న బైక్ అదుపుతప్పి మెడికల్ షాపు ముందున్న రేకుల షెడ్‌కు ఢీకొట్టింది. ఈ ఘటనలో రుతికేష్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్ర గాయాలైన శంకర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలను అన్నివిధాలా ఆదుకుంటాం

మణికొండ: పేద విద్యార్థుల చదువులు, అనారోగ్యాలు, వివాహాలకు ఆర్థిక సాయంతో పాటు అన్ని విధాలా ఆదుకుంటామని వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ జి.స్వరూప నగేష్ యాదవ్ అన్నారు. శనివారం గ్రామానికి చెందిన బుడల పెంటయ్య కూతురు వివాహానికి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మనకు ఉన్న దాంట్లో కొంత లేని వారికి ఇస్తే మానసిక సంతృప్తి మిగులుతుందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు రాబోయే రోజుల్లోనూ నిర్విరామంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులున్నా పేదలు తమను సంప్రదించాలని వారికి తగిన సాయం చేస్తామని ఆమె వెల్లడించారు. ఇప్పటి వరకు వంద మందికి పైగా ఆర్థికంగా ఆదుకున్నామని తెలిపారు.

రోడ్లపైనే నిరీక్షణ!

అందుబాటులోలేని బస్ షెల్టర్లు

- ఎండావానలో ప్రజలు, ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు


దుద్యాల్ గేట్ వద్ద బస్సు కోసం ఎండలో వేచియున్న ప్రయాణికులు


లగచర్ల గేట్ వద్ద కూలిపోయిన బస్ షెల్టర్

దుద్యాల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బస్టాండ్‌లు లేక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహబుబ్‌నగర్–చించోలి జాతీయ రహదారిపై దుద్యాల్ మండల కేంద్ర ప్రధాన గేట్‌తో పాటు మండలంలోని హస్నాబాద్, లగచర్ల గేట్, ఈర్లపల్లి, గౌరారం, చిలుముల మైల్వార్ తదితర గ్రామాల్లో బస్ షెల్టర్లు అందుబాటులో లేవు.

రద్దీగా ఉండే ప్రాంతాల్లో..

దుద్యాల్ గేట్, హస్నాబాద్ తదితర గ్రామాల మీదుగా మహబుబ్‌నగర్– తాండూరు రూట్లలో బస్సులు ఎక్కువగా తిరుగుతుంటాయి. లగచర్ల గేట్ నుంచి హైదారాబాద్‌కు అధిక సంఖ్యలో జనాలు రాకపోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో నిత్యం వందలాది మంది బస్సుల కోసం వేచి చూస్తుంటారు. వీరికి కనీసం నిలబడేందుకు కూడా చోటు లేకపోవడంతో రోడ్లపై నిలబడి బస్సుల కోసం పడిగాపులు కాస్తుంటారు. ప్రస్తుత వర్షాకాలంలో చినుకులు పడితే ఎక్కడా ఉండలేని పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన చోట బస్ షెల్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

బస్సుల కోసం వేచి చూసే సమయంలో తాగు నీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక జనం ఇక్కట్లకు గురవుతున్నారు. తాము వెళ్లే బస్సులు వచ్చే వరకు సమీపంలోని హోటళ్లను, ఆశ్రయిస్తున్నారు. బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు కూర్చోవడానికి ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి అవసరమైన ప్రారంతాల్లో బస్ షెల్టర్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **షెల్టర్లు ఏర్పాటు చేయాలి**
>
> 
>
> ప్రతి రోజు ప్రయాణికులు తాము వెళ్లే బస్సు వచ్చే వరకు నిరీక్షిస్తుంటారు. కూర్చోడానికి స్థలం లేక రోడ్డుపైన నిలబడుతున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ చూపి రద్దీగా ఉండే ప్రాంతాల్లో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి.
>
> – సురేశ్, ప్రయాణికుడు, దుద్యాల్

విహార యాత్రకు వెళ్లి..

- రేణిగుంట వద్ద బైక్ యాక్సిడెంట్
- గౌరారం గ్రామానికి చెందిన వేద పాఠశాల విద్యార్థి దుర్మరణం


చందుచారి (ఫైల్)

దుద్యాల్: దైవ దర్శనాల కోసం బైక్‌పై బయల్దేరిన ఇద్దరు స్నేహితులు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఒకరు మృతిచెందగా మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన కమ్మరి జగన్నాథచారి, సరిత దంపతుల కుమారుడు చందుచారి హైదరాబాద్‌లోని వేద పాఠశాలలో చదువుతున్నాడు. నల్లగొండ జిల్లాకు చెందిన శివకుమార్ అనే స్నేహితుడితో కలిసి ఇటీవల విహార యాత్రగా బైక్‌పై తిరుపతి, అరుణాచలం బయల్దేరారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి సమీపంలోని రేణిగుంట వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో చందు (19) అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన శివకుమార్ రేణిగుంట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల ఆధారంగా అక్కడి పోలీసులు శుక్రవారం సాయంత్రం తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

దాడి కేసులో నిందితులపై చర్యలు తీసుకోవాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లిలో దళితులపై దాడిచేసిన నిందితులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో శనివారం గుర్రంపల్లి గ్రామాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శంకర్‌తోపాటు మానవ హక్కుల వేదిక జంగయ్య, పాండు మాట్లాడుతూ.. బొడ్రాయి ఉత్సవాల్లో కొందరు యువకులు డ్యాన్స్ చేస్తూ ఆడ పిల్లలపై పడబోతుంటే అడ్డుకున్న దళిత యువకుడు ప్రవీణ్‌పై దాడిచేయడం బాధాకరమన్నారు. అంతటితో ఆగకుండా మరుసటి రోజు ప్రవీణ్ సోదరుడు శ్రీనివాస్ పంచాయతీ కార్యాలయం వద్ద ఫోన్ మాట్లాడుతుండగా దాడి చేసి చేయి విరగ్గొట్టారన్నారు. ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేసినా నిందితులపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే వారిపై కేసు నమోదుచేసి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు యాదయ్య, రామచంద్రయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈత, తాటి చెట్లను నరకొద్దు

ఎక్సైజ్ సీఐ బద్యనాథ్‌చౌహాన్


ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న సీఐ బద్యనాథ్‌చౌహాన్

ఆమనగల్లు: అనుమతి లేకుండా ఈత, తాటి చెట్లను నరికితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్‌చౌహాన్ హెచ్చరించారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఈత, తాటి చెట్ల నుంచి వచ్చే కల్లును విక్రయించి గౌడ కులస్తులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వీరు ప్రభుత్వం నుంచి లైసెన్స్ కలిగి ఉన్నారన్నారు. ఈత, తాటి చెట్లను నరకడం చట్ట ప్రకారం నేరమని చెప్పారు. తెలంగాణ ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం సొంత భూమిలోని ఈత, తాటి చెట్లను తొలగించాలన్నా ఎక్సైజ్ శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుందని వివరించారు. అవసరమైన వారు పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ పర్యవేక్షణలోని త్రిసభ్య కమిటీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తుందని తెలిపారు. కలెక్టర్ అనుమతితో వీటిని తొలగించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం ఒక్కో చెట్టుకు ప్రభుత్వానికి రూ.1,968 రుసుం చెల్లించాలన్నారు. ఎక్సైజ్ శాఖ అనుమతి లేకుండా చెట్లను తొలగిస్తే మొదటి తప్పుగా భావించి 3 నెలల జైలు శిక్ష, రెండో సారి తొలగిస్తే 6 నెలల జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కేశంపేట: ఆర్థిక సమస్యలు, అనారోగ్యంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేటలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన బట్టీల కుమార్ (38) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే తెల్లవారుజామున పొలానికి వెళ్లిన ఆయన వేప చెట్టుకు తాడుతో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన సమీప రైతులు కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు వచ్చిన బోరున రోదించారు. ఆర్థిక సమస్యలే కుమార్ మరణానికి కారణమని పేర్కొన్నారు. మృతుడి భార్య బట్టీల జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

అబ్దుల్లాపూర్‌మెట్ : ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారం గ్రామంలోని విజయవాడ జాతీయ రహదారి వంతెనపై శనివారం ఓ మహిళ మృతిచెంది ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించుకుని ఆచూకీ కోసం ఆధారాలు వెతకగా లభించలేదు. మృతిచెందిన మహిళ యాచకురాలై ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

అన్నోజిగూడలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడికి గాయాలు
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి
- అంత్యక్రియల్లో పాల్గొన్న జిల్లా రాజకీయ ప్రముఖులు



యాదయ్య(ఫైల్)

కందుకూరు: కుమార్తెను లండన్ పంపించేందుకు ఏర్పాట్లు చేసుకున్న ఓ తండ్రి ఊహించని ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని అన్నోజిగూడకు చెందిన మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గౌరెంకల యాదయ్య(54) శుక్రవారం ఉదయం బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కాగా మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉంది. ఈనెల 9న కూతురును ఉన్నత చదువుల కోసం లండన్‌లో పంపించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం సన్నిహితులు, బంధువులకు విందు ఏర్పాటు చేశాడు. కానీ ఊహించని ప్రమాదంలో గాయపడి మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, వివిధ పార్టీల నాయకులు, ముదిరాజ్ సంఘం నాయకులు హాజరై నివాళులర్పించారు.

అంబులెన్స్ దగ్ధం

గచ్చిబౌలి: అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ మార్చుతుండగా మంటలు చెలరేగడంతో పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెల్పిన వివరాల మేరకు..గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ఉన్న ఓ రోగి ఆక్సిజన్‌తో తెనాలికి వెళ్లాల్సి ఉండగా సీఎంఎస్ అంబులెన్స్‌ను బుక్ చేశారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో హాస్పిటల్ ఎమర్జెన్సీ ద్వారం వద్ద డ్రైవర్ అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ మార్చుతుండగా ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. నిమిషాల వ్యవధిలోనే ఎగసిపడటంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అంబులెన్స్ పూర్తిగా దగ్ధమైంది. పరికరాలు, సీట్లు కాలిబూడిదయ్యాయి. హాస్పిటల్ సీలింగ్‌కు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది పూర్తిగా మంటలు ఆర్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎవరికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని రాయదుర్గం పోలీసులు తెలిపారు.

బాలారిష్టాల్లో ఫ్యూచర్



- ఇప్పటికీ అడుగు పడని ప్రాజెక్టులు
- కేవలం స్కిల్ వర్సిటీకే పరిమితం
- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు కోర్టు బ్రేక్
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ప్లానింగ్‌లో పని చేసేందుకు అధికారుల నిరాసక్తి
- ఎఫ్‌సీడీఏ మాస్టర్ ప్లాన్ బాధ్యత హెచ్‌ఎండీఏ చేతికి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫ్యూచర్ సిటీ' భవిష్యత్ మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి అన్నట్లు మారింది. 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు, మెట్రో రైలు, ఏఐ సిటీ, జపాన్, తైవాన్ కంపెనీలు అంటూ రోజుకో ప్రకటనతో సర్కారు ఊదరగొడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటివరకు కేవలం స్కిల్ యూనివర్సిటీ మినహా మరే ప్రాజెక్టుకు ప్రతిపాదిత నాలుగో నగరిలో పునాది రాయి కూడా పడకపోవడం.. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ రెండు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ సిబ్బందిని కూడా సమకూర్చుకోకపోవడం చూస్తే.. ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కడ్తాల్, కందుకూరు, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం మండలాల్లోని 56 గ్రామాలను ఎఫ్‌సీడీఏ పరిధిలోకి తెచ్చారు. ఈ గ్రామాల అభివృద్ధిని క్షేత్రస్థాయి నుంచి పర్యవేక్షించాల్సిన ఎఫ్‌సీడీఏ ఆఫీసు మాత్రం మూడో నగరమైన (సైబరాబాద్) నానక్‌రాంగూడలో ఏర్పాటు చేయడం గమనార్హం.

సీఎం కలల ప్రాజెక్టు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలల ప్రాజెక్టు బాలారిష్టాలను ఎదుర్కొంటోంది. అధికారంలోకి రాగానే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో ఫోర్త్ సిటీ అవసరమని ప్రకటించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జాతీయ రహదారుల మధ్యలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించి ఏడాది గడుస్తున్నా ఆశించిన స్థాయిలో ఆ దిశగా అడుగులు ముందుకు పడటం లేదు. పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడంతో అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదు. రావిర్యాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి ఆకుతోట పల్లి వరకు 330 అడుగుల రతన్‌టాటా గ్రీన్‌ఫీల్డ్ రహదారికి భూసేకరణ పనులు చురుగ్గా సాగగా.. పరిహారం ఇవ్వకుండానే నిర్మాణ పనులకు టెండర్లు పిలవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిర్వాసితులు హైకోర్టును ఆశ్రయించడంతో బ్రేక్ పడింది. దీంతో ఇప్పటివరకు ఈ ప్రాంతంలో స్కిల్ వర్సిటీ పనులు మాత్రమే కాస్తో కూస్తో సాగుతున్నాయి.


సిబ్బంది కొరత

765.28 చదరపు కి.మీల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలన్నది రేవంత్ సర్కార్ లక్ష్యం. వివిధ విభాగాల నుంచి డెప్యుటేషన్‌పై 90 పోస్టులకు గత మార్చిలో మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిలో 34 రెగ్యులర్ పోస్టులు కాగా.. మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయాల్సి ఉంది. కానీ.. ఇప్పటివరకు ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక మినహా పూర్తిస్థాయి సిబ్బంది నియామకం జరగలేదు. సిబ్బంది కొరతతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ ఇతర విభాగాల నుంచి డెప్యుటేషన్‌పై ఎఫ్‌సీడీఏ ప్లానింగ్ విభాగంలో పనిచేసేందుకు అధికారులు నిరాసక్తి చూపిస్తున్నారు. దీంతో ఎఫ్‌సీడీఏ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో ఎలాంటి పురోగతి లేదు.

మాస్టర్ ప్లాన్ హెచ్‌ఎండీఏదే..

ఫోర్త్‌సిటీలో ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేయాలని నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ, విదేశీ సంస్థలు, పెట్టుబడులు తీసుకురావాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రతిబంధకాలు రాకుండా, అభివృద్ధి పనులు ప్రణాళికబద్ధంగా చకచకా సాగేలా ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందిచాలని నిర్ణయించారు. ఈ బాధ్యతలను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) అప్పగించినట్లు ఓ అధికారి తెలిపారు. గతంలో సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీడీఏ), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్లాన్ (ఏఏపీ) మాస్టర్ ప్లాన్లను హెచ్‌ఎండీఏనే అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. అలాగే ఎఫ్‌సీడీఏ పరిధిలోని గ్రామాలు గతంలో హెచ్‌ఎండీఏ పరిధిలోనే ఉన్నాయని, అందుకే ఎఫ్‌సీడీఏ మాస్టర్ ప్లాన్‌ను హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేస్తోందని ఆయన వివరించారు.

బెర్త్ దక్కేనా..?





- మంత్రి వర్గంలో రంగారెడ్డి జిల్లాకు దక్కని ప్రాతినిధ్యం
- విస్తరణ ఊహాగానాల నేపథ్యంలో మళ్లీ కదలిక
- ఎవరికి అవకాశం దక్కుతుందా అనే చర్చలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తెలంగాణలోనే కీలకమైన జిల్లా నేతలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా కొనసాగారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఒక్కరికీ అవకాశం దక్కలేదు. ప్రభుత్వానికి ఆర్థిక, రాజకీయ వనరులను సమకూర్చిపెట్టే కీలకమైన ఆయా జిల్లాల నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో రెండు మూడు రోజుల్లో మంత్రి వర్గ విస్తరణ ఉండనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. జిల్లా నేతలకు ఈసారైనా అవకాశం దక్కేనా అనేది వేచిచూడాలి.

సీనియార్టీనా.. సామాజిక సమీకరణాలా?

గ్రేటర్‌కు ఆనుకుని ఉన్న జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా వీటిలో ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన అనుభవం ఉండగా, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా పని చేసిన అనుభవం ఉంది. షాద్‌నగర్ నుంచి వీర్లపల్లి తొలిసారిగా గెలుపొందారు. ఆయన బీసీ సామాజిక వర్గం నుంచి వచ్చారు. కారుగుర్తుపై గెలుపొందిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మంత్రి పదవులు, అభివృద్ధి కోసం భారీ నిధుల పేరుతో హస్తం గూటికి చేరుకున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టుకు చేరింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు పదవులు దక్కే అవకాశం లేదు. మొదటి నుంచీ పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ..వారికి మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడంపై కేడర్‌లో నిస్తేజం నెలకొంది. డీసీసీ వేదికగా జరిగిన పలు సమావేశాల్లోనూ ఇదే అంశంపై నేతలు బహిరంగ విమర్శలకు దిగడం గమనార్హం. కొంత మంది సీనియర్ నేతలు ఏకంగా ఢిల్లీకి చేరుకుని పార్టీ అధిష్టానాన్ని కలిసి విన్నవించడం తెలిసిందే. పార్టీలో ఎక్కువ పదవులు ఒకే సామాజిక వర్గానికి కట్టబెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణలోనే కాదు కార్పొరేషన్, ఇతర పదవుల్లోనూ సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకోవాలని అధిష్టానం సూచించినట్లు తెలిసింది. సీనియార్టీకి ప్రాధాన్యత ఇస్తే మల్‌రెడ్డికి చాన్స్ ఉంటుంది. బీసీ నినాదాన్ని ఎత్తుకుంటే వీర్లపల్లికి అవకాశం ఉంది. ఇక ఎస్సీ కోటాకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తే ఇప్పటికే శాసనసభ స్పీకర్‌గా కొనసాగుతున్న గడ్డం ప్రసాద్‌కుమార్‌కు చాన్స్ కల్పించనుంది.

సమన్వయం చేసే వారు లేక ..

ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చి పెట్టడంలోనే కాదు పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనలో ముందు వరుసలో నిలిచే జిల్లాకు పూర్తి స్థాయి మంత్రి లేకపోవడం ఇబ్బందిగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలే కాదు చివరికి అధికారులు సైతం ప్రతి చిన్న పనికి ఇన్‌చార్జి మంత్రిని ఆశ్రయించాల్సి వస్తోంది. ఫ్యూచర్‌సిటీ కోసం భూ సేకరణ, కోహెడ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం, ఐటీ, అనుబంధ సంస్థలకు భూముల కేటాయింపు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధుల సేకరణ వంటి కీలక అంశాలపై జిల్లా నేతలతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాల్సి ఉంది. అంతేకాదు ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని, సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి కారణమైన నేతలకు నామినేటెడ్ పదవులు ఇప్పించుకోవడం, వ్యక్తిగత, ఇతర సమస్యలతో వచ్చే వారికి సమయం ఇచ్చి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉంది. జిల్లాకు పూర్తి స్థాయి మంత్రి లేకపోవడంతో అభివృద్ధి సహా సంస్థాగతంగా కేడర్‌ను బలోపేతం చేసే దిశగా ఎలాంటి అడుగులు పడటం లేదు. ఇన్‌చార్జి మంత్రి ఉన్నప్పటికీ..ఆయనతో జిల్లా సెకండ్ కేడర్ నేతలకు పెద్దగా పరిచయాలు లేకపోవడం , అధ్యయనాల పేరుతో ఆయన తరచూ విదేశాల్లో పర్యటించాల్సి వస్తుండటం, కేవలం ముఖ్య నేతలు పాల్గొనే బహిరంగ సభలు, సమావేశాలకే పరిమితం అవుతుండటం జిల్లా నేతలకు ఇబ్బందిగా మారింది. జిల్లాస్థాయి సమీక్ష, సమావేశాలు కూడా నామమాత్రంగా నిర్వహించి వెళ్తుండటాన్ని కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. తాజాగా విస్తరణ కథనాలతో బెర్త్ ఎవరికి దక్కుతుందన్న చర్చలు మొదలయ్యాయి.

పూరి గుడిసె దగ్ధం

కేశంపేట: ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కాకునూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రల రమేశ్ కూలీ పనులు చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లడంతో ఆమెను తీసుకువచ్చేందుకు శుక్రవారం అత్తగారి ఊరికి వెళ్లాడు. శనివారం ఉదయాన్నే తన గుడిసె కాలిపోయిందని స్థానికులు ఫోన్ చేయడంతో వెంటనే ఇంటికి చేరుకున్నాడు. బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.